ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 17 మే 2024



సూర్యప్రభ వాహనంపై ఆశీనుడైన చెన్నకేశవుడు

సూర్య, చంద్రప్రభలపై చెన్నకేశవుడి విహారం

ధర్మవరం, మే 16: పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై విహరించారు. చెన్నకేశవుడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవాల్లో అన్నమయ్య సేవామండలి ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. శుక్రవారం సర్వభూపాల, సింహవాహనాలపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.



చంద్రప్రభ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

అన్నదాతకు అన్యాయం!



వన్‌బీ జారీలో నిర్లక్ష్యం

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోలేని దుస్థితి

ముగిసిన గడువు..

పూర్తి వడ్డీ కట్టాల్సి వస్తోందని రైతుల ఆవేదన

పట్టించుకోని పాలకులు, అధికారులు



నంబులపూలకుంట, మే 16: అన్నదాత కష్టం ఎవ్వరికీ పట్టలేదు. పంట రుణాల రెన్యూవల్ కోసమని వన్‌బీ ఇవ్వాలంటూ తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేసినా పట్టించుకునే వారేలేరు. రైతు ఖాతాల లాక్‌లను తొలగించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపారు. ఇంతలోనే రెన్యూవల్ గడువు ముగిసింది. పావలా వడ్డీ వర్తింపునకు రైతులు దూరమయ్యారు. పంటలు పండక అప్పుల ఊబిలో కూరుకుపోయిన తాము పంట రుణాలపై అంతేసి వడ్డీలు ఎలా కట్టాలని రైతులు వాపోతున్నారు. రైతులు పంట పెట్టుబడుల కోసం ముందస్తుగా బ్యాంకులో రుణాలు తీసుకుంటారు. అందుకు ఏటా వడ్డీ చెల్లించి, రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. రుణం తీసుకున్న తేదీకి ఒకరోజు ముందుగా మరుసటి ఏడాది రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ ఏడాది రెవెన్యూ సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉండడంతో పంట రుణాల రెన్యూవల్‌కు అవసరమైన వన్‌బీని రైతులు పొందలేకపోయారు. గడువులోపు రెన్యూవల్ చేసుకోకపోవడంతో చాలా మంది వడ్డీ మాఫీకి దూరమయ్యారు. మండలంలోని నల్లగుట్టపల్లి, మరికొమ్మదిన్నె, ఎర్రవంకలవారిపల్లికి చెందిన రైతులకు సం బంధించి పంట రుణాల రెన్యూవల్ గడువు ఈనెల 14వ తేదీతో ముగిసింది. చాలామంది రైతులు వన్‌బీ కోసమని తహసీల్దార్ కార్యాలయం, మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ చేశారు. గడువులోపు రెన్యూవల్ చేసుకోకపోతే రైతులకు పావలావడ్డీ వర్తించదు. పంటలు పండక, పెట్టుబడులు చేతికి అందక అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు వడ్డీ భారమవుతోంది. సకాలంలో చెల్లించిన రైతులకు పావలావడ్డీ వర్తించనుండడంతో కాస్త ఉపశమనం పొందుతారు.



మీభూమి పత్రాలతో రెన్యూవల్ చేసుకోవచ్చు

బ్యాంకు వద్ద ఉన్న డేటా, తహసీల్దార్ కార్యాలయంలో లభించే మీభూమి పత్రాల్లో వివరాలు పొందుపరిచి ఉంటాయి. దీని ఆధారంగా రైతులు పంట రుణాలను రెన్యూవల్ చేసుకునే అవకాశం ఉంది.

- నరేంద్రకుమార్, తహసీల్దార్, నంబులపూలకుంట

తహసీల్దార్ కార్యాలయం వద్ద వేచివున్న రైతులు

బ్యాంకులు ససేమిరా

రైతులకు సంబంధించిన భూముల వివరాలను మీభూమి పోర్టల్‌లో పొందుపరిచి ఉంటారు. మీభూమి కాపీతో పంట రుణాల రెన్యూవల్‌కు బ్యాంకు అధికారులు ససేమిరా అంటున్నారు. వన్‌బీ తప్పనిసరి అంటున్నారు. గతంలో గ్రామ సచివాలయాల్లో వన్‌బీ తీసుకుని, పంట రుణాలు రెన్యూవల్ చేసుకునేవారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సచివాలయాల్లో వన్‌బీ ఇవ్వట్లేదు. దీంతో మీసేవ కేంద్రాల్లో తీసుకోవాల్సి వస్తోంది. మీసేవ కేంద్రానికి వెళితే రైతు ఖాతాలు లాక్‌లో ఉన్నాయని చెబుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఖాతాలను పరిశీలించి, వన్‌బీ మంజూరు చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో చాలామంది రైతులు గడువుకంటే 15 రోజులు ముందుగా వచ్చి వారి ఖాతాలను పరిశీలించుకోవాల్సి ఉంది. నిర్లక్ష్యం చేసిన రైతులకు నష్టం తప్పదు.





వడ్డీ చేతినుంచి కట్టాల్సి వస్తోంది



నాకు మూడెకరాల భూమి ఉంది. పంట రుణాల రెన్యూవల్‌కు వన్‌బీ లేక ఇబ్బందులు పడ్డా. తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని, వన్‌బీ పొందేలోపు రెన్యూవల్ గడువు ముగిసింది. దీంతో రెన్యూవల్ చేసుకోలేకపోయా. పావలా వడ్డీ కూడా వర్తించ లేదు. ఉన్న కష్టాలకు తోడు పంట రుణాలపై పూర్తివడ్డీ కట్టడం భారంకానుంది. అప్పులు చేసి, వడ్డీ చెల్లించాల్సి వస్తోంది.

- లక్ష్మీనరసమ్మ, నల్లగుట్టపల్లి

ఖాతా లాక్‌లో ఉంది

నాకు ఏడెకరాల భూమి ఉంది. ఏటా గడువులోపు వడ్డీ చెల్లించి, పంట రుణం రెన్యూవల్ చేసుకునే వాడిని. ఈసారి కూడా రెన్యూవల్‌కు ముందుగా వన్‌బీ కోసం మీసేవ కేంద్రానికి వెళ్లగా.. ఖాతా లాక్‌లో ఉందని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయానికెళ్లి దరఖాస్తు చేసుకున్నా. రైతు ఖాతాలు లాక్‌లో ఎందుకు పడతాయో, ఇలాంటి సమయంలోనే ఎందుకు ఇబ్బంది పెడుతున్నారో అర్థం కావట్లేదు.



- రామచంద్రప్పనాయుడు, గంగినాయునిపల్లి

అందని పంట నష్ట పరిహారం

గతేడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసింది. ఈక్రాపింగ్, సాగు విస్తీర్ణం ఆధారంగా ఇచ్చింది. బటన్ నొక్కి నెలలు కావస్తున్నా.. నేటికీ రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ కాలేదు. రుణాల రెన్యూవల్, సబ్సిడీ అన్నదాతకు ఉపశమనం కల్పించేవి. నేటికీ పంటనష్టపరిహారం డబ్బు జమకాకపోవడంతో రైతులు అప్పులు చేసి, రుణాలు రెన్యూవల్ చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రెన్యూవల్ చేసుకోని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	36.0 25.0	34.0 25.0	36.0 26.0	33.0 24.0	33.0 24.0

స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్

హిందూపురం/లేపాక్షి, మే 16: సార్వత్రిక ఎన్నికల ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు గురువారం తనిఖీ చేశారు. హిందూపురం పట్టణ పరిధి బిట్ కళాశాల, లేపాక్షి మండలంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను పరిశీలించారు. కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో డీఎస్పీ స్థాయి అధికారులు, ఇతర పోలీసు సిబ్బంది 24 గంటలు విధుల్లో ఉంటారన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉద్యోగాలు ఊడతాయని హెచ్చరించారు. పట్టణ పరిధి బిట్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు అపూర్వ భరత్, భాగ్యరేఖ, వెంకటశివరామిరెడ్డి, గౌరీశంకర్, డీఎస్పీ కంజక్షన్, సీఐ ఈరన్న, తహసీల్దార్లు పాల్గొన్నారు.



హిందూపురంలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు పాలకుల హామీ

ఆశలపై నీళ్లు..!

భూమిపూజ కూడా చేసిన వైనం

తరువాత పక్క జిల్లాకు తరలింపు

జిల్లా రైతుకు తప్పని నష్టాలు

తనకల్లు, మే 16: జిల్లాలోని టమోటా రైతు ఆశలపై పాలకులు నీళ్లు చల్లారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలనేది మండల రైతుల కల. ఏర్పాటు చేస్తామని వైసీపీ పాలకులు హామీ ఇచ్చారు. ఆ మేరకు నిర్మిస్తామని భూమిపూజ కూడా చేశారు. ఆ తరువాత పక్క జిల్లాకు తరలించి, స్థానిక రైతులకు అన్యాయం చేశారు. దీంతో గిట్టుబాటు ధర దక్కక అన్నదాతలు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. కూలీ ఖర్చులు కూడా రావని పొలాల్లోనే దిగుబడిని వదిలేస్తున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఆసియా ఖండంలోనే పెద్దదైన టమోటా మార్కెట్ ఉంది. ఈ మార్కెట్‌కు తనకల్లు మండలం అతి సమీపంలోనే ఉంది. దీంతో మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఏడాది పొడవునా వందలాది ఎకరాల్లో టమోటా సాగు చేస్తుంటారు. నిలకడలేని ధరలతో కుదేలవుతున్నారు. ఎకరంలో పంట సాగుకు రూ1.50 లక్షలదాకా పెట్టుబడి అవుతోంది. పంట చేతికొచ్చే సమయానికి ధరలు పడిపోతుండడంతో కూలీ ఖర్చులు కూడా రావని పొలాల్లోనే వదిలేస్తున్నారు. టమోటా రైతులను ఆదుకోవడానికి తనకల్లు మండలంలోని గందోడివారిపల్లి సమీపాన టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం పొల్లాన్ని లీజుకు తీసుకుని, భూమిపూజ కూడా చేశారు. మహిళా సంఘాల ద్వారా ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పుతున్నట్లు చెప్పారు. ఉన్నట్లుండి ప్రాసెసింగ్ యూనిట్‌ను అనంతపురం జిల్లాకు తరలించారు. దీంతో ఈ ప్రాంత టమోటా రైతులకు నష్టాలు తప్పట్లేదు.

ఏటా నష్టపోతూనే ఉన్నాం

ఏటా టమోటా సాగుకు రూ.లక్షల్లో పెట్టుబడులు పెడుతున్నాం. పంట చేతికొచ్చే సమయానికి ఇతర రాష్ట్రాల నుంచి టమోటాలను తెప్పిస్తుండడంతో స్థానికంగా నష్టపోతున్నాం. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, ములకలచెరువు, కర్ణాటకలోని చింతామణి, వడ్డిపల్లి, కోలార్ తదితర మార్కెట్లకు టమోటా దిగుబడులను తీసుకెళ్తాం. కూలీలు కూడా గిట్టుబాటుకాకపోవడంతో పొలాల్లోనే టమోటా దిగుబడులు వదిలేస్తున్నాం.

- మునెప్ప, రైతు, కొత్తకురవపల్లి



ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి

గతేడాది మే, జూన్ నెలల్లో 30కేజీల టమోట బాక్సు రూ.మూడు, నాలుగువేలు పలికింది. ప్రస్తుతం రూ.200 దాటడంలేదు. నిలకడలేని ధరలతో నష్టపోతున్నాం. గందోడివారిపల్లి వద్ద ఏర్పాటు చేస్తామన్న ప్రాసెసింగ్ యూనిట్‌ను వెంటనే నిర్మించాలి.

- శీనానాయక్, రైతు, రతినేనాయక్‌తండా





మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న టమోటా



40 శాతం రాయితీతో

విత్తన వేరుశనగ

రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

కొత్తచెరువు/పుట్టపర్తిరూరల్, మే 16: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా వివిధ రకాల పంటల సాధారణ సాగు విస్తీర్ణం 2.44 లక్షల హెక్టార్లు కాగా.. ఇందులో 1.74 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగవుతుందన్నారు. 1,00,443 క్వింటాళ్ల విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో వేరుశనగ 97,886, కందులు 1500, రాగులు 300, పెసలు 200, ఉలవలు 300, అలసంద 100, కొర్రలు 20, జీలుగ 138 క్వింటాళ్ల సరఫరాకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఖరీఫ్ సీజన్‌కు యూరియా 14,875, డీఏపీ 5969, ఎంఓపీ 1151, కాంప్లెక్స్ 1456, ఎస్‌పీ 2821 టన్నుల సరఫరాకు అనుమతులు వచ్చాయని ఆయన తెలిపార. విత్తన కాయలు కావాల్సిన రైతులు వారివారి గ్రామాల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఇతర పంటలు సాగుచేసే రైతులు కూడా విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.





ఓటేయని వారు.. 2,53,516

క్యూలో ఉన్న ఓటర్లు(ఫైల్)

అవగాహన కల్పించినా.. ప్రయోజనం శూన్యం

హిందూపురం, మే 16: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. ఐదేళ్లకోసారి వచ్చే ఓటు పండగలాంటిది. అలాంటి దానిని చేజార్చుకున్నారు. జిల్లావ్యాప్తంగా 16,56,778 మంది ఓటర్లు ఉండగా.. సార్వత్రిక ఎన్నిల్లో 14,03,259 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2,53,516 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. ఓటు హక్కుపై ప్రభుత్వ కార్యాలయాల వద్ద బ్యానర్లు, పోస్టర్లు, డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసినా.. అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించలేకపోయారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛంద సంస్థలు, అధికారులు ఓటు అవగాహన కార్యక్రమానికి హాజరై, కేవలం ఫొటోలకు పరిమితం అయ్యారుతప్ప.. నేరుగా ఓటరుకు అవగాహన కల్పించేలా కరపత్రాలు, ప్రచార కార్యక్రమాలతో ఆకట్టుకోలేకపోయారని విమర్శలున్నాయి. ఫలితంగా చాలా నియోజకవర్గాల్లో 30 నుంచి 40వేల మంది ఓటర్లు ఓటుకు దూరమయ్యారు.

హిందూపురం నియోజకవర్గంలో..

నియోజకవర్గానికి చెందిన వేలమంది ఓటర్లు వివిధ ప్రాంతాలకు ఉపాధి కోసం వలస వెళ్లారు. వీరితోపాటు అత్యవసర విభాగాలకు చెందిన ఉద్యోగులు ఎక్కువ మంది ఉండటంతో తక్కుత మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజకీయ పార్టీల నాయకులు... వలస వెళ్లిన ఓటర్లను రప్పించేందుకు అన్నివిధాలా సహకరించారు. కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు రప్పించలేకపోయారని నాయకులే అంటున్నారు. హిందూపురం పట్టణంలో అధికమంది ఓటు హక్కుకు దూరమైనట్లు తెలుస్తోంది. పట్టణవ్యాప్తంగా ఎక్కడా పోలింగ్ 80శాతం దాటలేదు. 60 నుంచి 70శాతం వరకు ఎక్కువ వార్డుల్లో ఓట్లు పోలయ్యాయి. పల్లెల్లో 80 నుంచి 90శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలో 1.20లక్షలకుపైగా ఉన్న ఓటర్లు ఉండగా.. చాలామంది ఓటు హక్కును వనియోగించుకోలేకపోయారు. దీంతో ఓటు శాతం తగ్గింది.

పెనుకొండలో..

నియోజకవర్గంలో చాలా మంది బయట ప్రాంతాల్లో ఉన్నారు. వారిలో సగం మందే ఓటుకు వచ్చినట్లు సమాచారం. కొంతమంది ఉద్యోగులు సైతం బయటి ప్రాంతాల్లో ఉన్నారు. వీరు ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారని తెలుస్తోంది. ఫలితంగా ఓటుకు చాలామంది దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

కదిరిలో...

నియోజకవర్గంలో వేలాది మంది ఇతర రాష్ట్రాలు, గల్ఫ్‌లో ఉన్నారు. వీరికి ఓటున్నా సద్వినియోగం చేసుకోలేకపోయారు. కొంతమంది కర్ణాటకలో ఉన్న వారిని కూడా రప్పించలేకపోయారని ఒక పార్టీ నాయకులు మండిపడుతున్నారు.

మడకశిరలో..

నియోజకవర్గానికి చెందిన చాలామంది ఓటర్లు కర్ణాటకకు వలస వెళ్లారు. వారిని రప్పించడంలో ప్రధాన పార్టీలవారు విఫలమైనట్లు తెలిసింది. వారికి ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకుని, రప్పించి ఉండుంటే ఓటింగ్ శాతం మరింత పెరిగేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పుట్టపర్తిలో..

నియోజకవర్గానికి చెందిన చాలామంది ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ ఇతర ప్రాంతాల్లో ఉన్నారు. వారిలో చాలామంది ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. ఈ నియోజకవర్గంలో కూడా వేలాది మంది ఇతర రాష్ట్రాల్లో ఉన్నారు. వీరిలో కొంతమంది ఓటు వేయలేకపోయారు.

ధర్మవరంలో...

నియోజకవర్గ ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడంలో ముందున్నారు. ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే కొంతమేర ఫర్వాలేదు. ఇక్కడ కూడా 27వేల మంది వరకు సద్వినియోగం చేసుకోలేదు. చాలామంది ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. వారు ఓటుకు రాలేకపోయారని సమాచారం.

రాప్తాడులో...

నియోజకవర్గంలో 37వేల మంది ఓటు హక్కును చేజార్చుకున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గానికి చెందిన చాలామంది అనంతపురంలో స్థిరపడ్డారు. వారి ఓట్లు స్వగ్రామాల్లో ఉన్నాయి. వారు ఓటును వినియోగించుకోలేకపోయారు. జిల్లావ్యాప్తంగా ఒకసారి పోలింగ్ శాతం పరిశీలిస్తే హిందూపురం చాలా వెనుకబడి ఉంది. 2,49,174 మంది ఓటర్లు ఉండగా.. 1,93,906 మంది మాత్రమే ఓటేశారు. సుమారు 55వేల మంది ఓటుకు దూరంగా ఉన్నారు. రాప్తాడులో 2,50,571 మందికిగాను 2,13,207 మంది, మడకశిరలో 2,10,804 మందికిగాను 1,84,358 మంది, పెనుకొండలో 2,35,986 మందికిగాను 2,05,192 మంది, పుట్టపర్తిలో 2,11,062 మందికిగాను.. 1,82,090 మంది, ధర్మవరంలో 2,45,758 మందికిగాను 2,18,292 మంది, కదిరిలో 2,53,420 మందికిగాను 206214 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో ఇతరులు 76మంది ఉండగా 36 మంది మాత్రమే ఓటు వేశారు.


పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్యసిబ్బంది

బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ నిర్మూలన

● డీఎంహెచ్‌ఓ మంజువాణి

పుట్టపర్తిరూరల్ మే 16: అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయవ్యాధిని శాశ్వతంగా నిర్మూలించవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంనుంచి గణేష్‌కూడలి వరకు గురువారం ఆమె వైద్యసిబ్బందితో కలిసి క్షయ నివారణ, డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల క్షయ మళ్లీ రాదన్నారు. శాశ్వతంగా నిర్మూలన అవుతుందన్నారు. ఐదేళ్లుగా టీబీ వచ్చి తగ్గిపోయిన వారు, అరవైఏళ్ల వయసు నిండిన వారు, పొగ తాగేవారు, షుగర్ ఉన్నవారు, ఎత్తుకు తగిన బరువు లేనివారు తప్పకుండా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. అలాగే డెంగీ నివారణకు ప్రజలు పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా డెంగీని అరికట్టవచ్చన్నారు. ప్రతిశుక్రవారం ఫ్రైడే‌ఫ్రైడే పాటించాలని, తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. దోమలు కుట్టడం వల్లే డెంగీ, మలేరియా లాంటివి వస్తాయని, కనుక వాటి భారిన పడకుండా దోమ తెరలు వాడాలని, సాయంత్రం సమయంలో ఇళ్ల ముంగిట వేపాక పొగ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా నివారణ జిల్లా అధికారి డాక్టర్ నాయక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జ్యోత్స్న, సీహెచ్‌ఓ నగేష్, పీహెచ్‌ఎన్ లలితకుమారి, ఎస్‌యూఓ రమణయ్య డీపీసీ మల్లికార్జున, పీపీఎం నాగేంద్ర, డీపీఎస్ ఆంజనేయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ చైతన్యపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ


చికిత్స పొందుతున్న దాసరి కిరణ్‌ను పరామర్శిస్తున్న కాలవ శ్రీనివాసులు, వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, మే 16: జేసీ ప్రభాకరరెడ్డి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న దాసరి కిరణ్‌పై దాడికి పాల్పడిన డీఎస్పీ చైతన్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి గురువారం ఆయన అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న దాసరి కిరణ్‌ను పరామర్శించారు. ఓడిపోతున్నామన్న అక్కసుతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మూడు రోజులుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. పెద్దారెడ్డి స్వయంగా దాడిలో పాల్గొన్నారని, ఎమ్మెల్యేని సకాలంలో కట్టడి చేయడంలో పోలీసులు విఫలమయ్యారని అన్నారు. గతంలో తాడిపత్రిలో అత్యంత వివాదాస్పదంగా వ్యవహరించిన డీఎస్పీ చైతన్యను రాజంపేట నుంచి తాడిపత్రికి రప్పించడం పైస్థాయిలో జరిగిన కుట్ర అని అన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటిపై డీఎస్పీ చైతన్య ఉద్దేశపూర్వకంగా దాడి చేయించారని, కంప్యూటర్ ఆపరేటర్ కిరణ్‌ను ఇంటి బయటకు తీసుకువెళ్లి దారుణంగా చితకబాదారని అన్నారు. ఈ ఘటనపై ఇప్పటి దాకా ఎంఎల్‌సీ నమోదు చేయలేదని, బాధితుడి స్టేట్‌మెంట్ కూడా నమోదు చేయలేదని అన్నారు. పోలీసుల పక్షపాత వైఖరికి ఇదే నిదర్శనమని అన్నారు. సీఎం జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి డైరెక్షన్‌లోనే తాడిపత్రి పోలీసులు ఏకపక్షంగా పనిచేస్తున్నారన్నారని ఆరోపించారు. పోలీసులే హింసకు ఒడిగడితే శాంతి భద్రతలను ఎవరు కాపాడతారని ప్రశ్నించారు. దళితుడు, దివ్యాంగుడైన కిరణ్‌ను డీఎస్పీ చైతన్య విచక్షణా రహితంగా కొట్టడం దారుణ మని వెంకటశివుడు యాదవ్ అన్నారు. తాడిపత్రిలో పనిచేసే సమయంలో డీఎస్పీ చైతన్య టీడీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్‌గా చేసుకొని హింసించారని అన్నారు. అందుకే ఆయన్ను ఇక్కడి నుంచి బదిలీ చేశారని అన్నారు. తాడిపత్రిలో గొడవలు జరిగే సమయంలో పోలీసు బలగాల పేరుతో ఆయన్ను రప్పించి, టీడీపీ నాయకులపై దాడులు చేయించడం అప్రజాస్వామికమని అన్నారు. డీఎస్పీ చైతన్య కక్ష్యసాధింపు చర్యలపై విచారణ చేయించి, ఆయనపై హత్యాయత్నం కేసు నమోదు చేస్తేనే పోలీసు వ్యవస్థపై సామాన్యులకు నమ్మకం కలుగుతుందని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా పోలీసు ఉన్నతాధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారివెంట టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, నాయకులు గంజే నాగరాజు, లక్ష్మీనరసింహ, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న తదితరులు ఉన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అరెస్టు

అనంతపురం విద్య, మే 16: తాడిపత్రిలో పోలీసులు దాడిలో తీవ్రంగా గాయపడిన కిరణ్‌ను పరామర్శించడానికి వెళ్తున్న సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో ఉన్న దివ్యాంగుడు కిరణ్‌ను పోలీసులు విచక్షణా రహితంగా కొట్టడంతో అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. దీంతో గురువారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్‌ను పరామర్శించడానికి సీపీఐ జాఫర్, ఇతర నాయకులు బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు జాఫర్‌ను ఆయన ఇంటి వద్దే అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీపై సందిగ్ధం..!



● సమీపిస్తున్న ఖరీఫ్ సీజన్.. మరో పక్షం రోజులే గడువు
● పోలింగ్ ముగిసినా పట్టించుకోని ప్రభుత్వం
● మొదలైన విత్తన ప్రాసెసింగ్ పనులు
● సబ్సిడీ ధరల ఖరారుపై నిర్లక్ష్యం

అనంతపురం అర్బన్, మే 16: కరువు రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీపై సందిగ్ధం నెలకొంది. ఎన్నికల పోలింగ్ ముగిసి నాలుగు రోజులు కావస్తున్నా... జిల్లాకు విత్తన కేటాయింపు... సబ్సిడీ ధరల ఖరారుపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం విస్మయం కలిగిస్తోంది. ఈ ఏడాది మార్చి మొదటి వారంలోనే జిల్లాకు కావాల్సిన విత్తన వేరుశనగ, ఇతర రకాల అంతర పంటల విత్తనాలపై జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రతిపాదనలు పంపించి రెండు మాసాలు గడుస్తున్నా.. ఇప్పటి దాకా అతీగతీ లేకుండా పోయింది. పోలింగ్ తర్వాత విత్తనాల కేటాయింపుతోపాటు సబ్సిడీ ధరలు ఒకే సారి ఖరారు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ ఉన్నతాధికారులు భావించినట్లు తెలుస్తోంది. అయితే ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ఆరంభమవుతుంది. ఇందుకు మరో పక్షం రోజేలే సమయం ఉంది. అయితే ఇప్పటి దాకా జిల్లాకు విత్తన కేటాయింపుతోపాటు సబ్సిడీ ధరలు ఖరారు చేయకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విత్తనాల కేటాయింపు... సబ్సిడీ ధరలపై నిర్లక్ష్యం

జిల్లాకు సబ్సిడీ విత్తనాల కేటాయింపుతో పాటు సబ్సిడీ ధరలు ఖరారు చేయడంపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ ఏడాది మార్చిలోనే ఖరీఫ్ సీజన్‌లో విత్తన వేశనగతోపాటు ఇతర రకాల విత్తనాల కేటాయింపులకు సంబంధించి ప్రతిపాదనలు పంపారు. ఈ సారి జిల్లాకు వేరుశనగ 1.25 లక్షల క్వింటాళ్లు, కంది 2500 క్వింటాళ్లు, గ్రీన్ పచ్చి రెట్ట ఎరువులు 600, కొర్ర 100, పెసలు 100, అలసందలు 150, రాగి 50 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి దాకా జిల్లాకు విత్తనాలు కేటాయించి, సంబంధించిన గైడ్‌లైన్స్‌ను జారీ చేయడంలో ప్రభుత్వం జాప్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గతేడాది జిల్లాకు 78,245 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించారు. ఇందులో 8వేల క్వింటాళ్లు కదిరి లేపాక్షి రకం, మిగతాది కే-6 రకం విత్తన వేరుశనగను కేటాయించారు. ఈ సారి ఎప్పటిలోగా విత్తన కాయలు కేటాయిస్తారు..? ఎప్పటిలోగా ఆర్బీకేలకు విత్తన కాయలు సరఫరా చేసి రైతులకు అందిస్తారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సకాలంలో విత్తన పంపిణీ జరిగేనా..?

గతేడాది మే మొదటి వారంలోగానే విత్తన వేరుశనగతోపాటు ఇతర రకాల విత్తనాల సబ్సిడీ ధలు ఖరారు చేశారు. గత ఏడాది మే 16 నుంచి ఆర్బీకేల్లో రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ మొదలు పెట్టారు. మే 29 నుంచి విత్తన పంపిణీ ఆరంభించారు. ఈ సారి ఇప్పటి దాకా విత్తన పంపిణీకి సంబంధించిన ఎలాంటి గైడ్ లైన్స్ జారీ కాలేదు. సబ్సిడీ విత్తన సరఫరాకు టెండర్లు ఖరారు చేయడంతో జిల్లాలోని ఎనిమిది ప్రాసెసింగ్ యూనిట్లల్లో ఎట్టకేలకు ప్రాసెసింగ్ మొదలుపెట్టారు. ఇప్పటి దాకా తొమ్మిది వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. విత్తన వేరుశనగను ప్రాసెసింగ్‌ను మరింత వేగవంతం చేయడంతోపాటు నాణ్యత ప్రమాణాలు పాటించేలా జిల్లా వ్యవసాయ యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకపోతే ఈ సారి సకాలంలో విత్తన పంపిణీ నిర్వహించడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరి ఏ మేరకు అధికారులు చొరవ చూపుతారో వేచిచూడాల్సిందే.

విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ మొదలైంది



జిల్లాకు విత్తన వేరుశనగతో పాటు ఇతర అంతర పంటల విత్తనాలు ఎంత మోతాదులో కావాలన్న దానిపై ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే విత్తన సరఫరా కోసం రాష్ట్ర స్థాయిలో టెండర్లు ఖరారయ్యాయి. జిల్లాలోని ఎనిమిది ప్రాసెసింగ్ యూనిట్లల్లో విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ మొదలు పెట్టాం. ఇప్పటి వరకు తొమ్మిది వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ పూర్తైంది. ప్రాసెసింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నాణ్యమైన విత్తన కాయలను రైతులకు పంపిణీ చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. **- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి**

సచివాలయం ఖాళీ..!

● కనిపించని ఉద్యోగులు
● తలుపులు తెరుస్తున్న వలంటీర్లు
● ఇబ్బందుల్లో లబ్ధిదారులు


గాండ్లపెంట సచివాలయం

గాండ్లపెంట, మే 16: మండలకేంద్రంలోని సచివాలయం ఉద్యోగులు లేక ఖాళీగా దర్శనమిస్తోంది. సమయపాలన పాటించట్లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయంలో వివిధరకాల పదవుల్లో 11 మంది సిబ్బందిని నియమించారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, వన్‌బీలు తదితరాల కోసం నిత్యం జనం సచివాలయానికి వస్తుంటారు. ఉద్యోగులు అందుబాటులో లేకపోతుండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ తలుపులను వలంటీర్లు తెరవాల్సి వస్తోంది. సాయంత్రం వారే మూయాల్సి వస్తోంది. ఉదయం 10 గంటలకే సచివాలయం తెరవాలి. సిబ్బంది మొత్తం హాజరుకావాలి. సచివాలయ ఉద్యోగులు 11 గంటలైనా విధులకు రావట్లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వెళితే సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గురువారం ఉదయం 11 గంటలైనా ఒకరో.. ఇద్దరో.. ఉద్యోగులు వచ్చి సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. వివిధ పనుల నిమిత్తం గ్రామస్థులు ఫోన్‌లో సంప్రదించగా.. కంప్యూటర్లు పనిచేయట్లేదని సమాధానం చెప్పినట్లు బాధితులు వాపోతున్నారు. మరికొంత మంది సిబ్బంది సెలవులో ఉన్నామని చెబుతున్నారట. పంచాయతీ కార్యదర్శి కూడా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. గొడ్డువెలగల కార్యదర్శి బాషాకు గాండ్లపెంట ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మండలకేంద్రంలోని ప్రధాన రహదారిలో ఉన్న సచివాలయానికి తలుపులు తెరచివేసి, సిబ్బంది ఎవరూ లేకపోవడం పట్ల జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విలువైన వస్తువులు పోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈవిషయంపై ఎంపీడీఓ రామానాయక్‌ను అడగ్గా.. వెటర్నరీ అసిస్టెంట్ కదిరికి బదిలీ అయ్యారనీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సెలవులో ఉన్నారన్నారు. మిగిలినవారు సెలవులో ఉన్నట్లు తనకు సమాచారం లేదని చెప్పుకొచ్చారు.


సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

వేర్వేరుచోట్ల ఇద్దరి ఆత్మహత్య

● భర్త పట్టించుకోలేదని భార్య
● ప్రియురాలు బ్రేకప్ చెప్పిందని యువకుడు

అనంతపురం క్రైం, మే 16: అనంతపురం నగర పరిధిలో వేర్వేరు కారణాలతో ఓ మహిళ, మరో యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. పాపంపేటకు చెందిన జ్యోతి (28) తన భర్త పట్టించుకోవడం లేదని, కుటుంబ అవసరాలు తీర్చడం లేదని జీవితంపై విరక్తి చెందింది. బుధవారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకుంది. ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. నగర శివారులోని ఆదర్శనగర్‌కు చెందిన గౌరీశంకర్ (21) డిగ్రీ చదివాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో అమ్ము పేరుతో ఓ అమ్మాయి పరిచయమైంది. ఆ అమ్మాయితో ప్రేమలో మునిగాడు. రెండు నెలల క్రితం ఆ అమ్మాయి బ్రేకప్ చెప్పింది. దీంతో అప్పటి నుంచి తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. ఇదే క్రమంలో మనస్తాపానికి గురైన గౌరీశంకర్ బుధవారం రాత్రి తన ఇంట్లోని ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించేసరికి అతను చనిపోయాడు. ఈ రెండు ఘటనలపైనా అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నగరంలో ఓ కారు ఢీ కొని ఓ గుర్తు తెలియని వ్యక్తి (58) మరణించాడు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఓ వ్యక్తి తపోవనం సర్కిల్‌లో రోడ్డును క్రాస్ చేస్తుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అతను మరణించాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుడిపై వైసీపీ మూకల దాడి

● తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలు

పెనుకొండ రూరల్, మే 16: మండలంలోని మావటూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సంపత్ కిష్టప్పపై అదే ఊరికి చెందిన వైసీపీ వర్గీయులు గురువారం దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. సంపత్‌కిష్టప్ప సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరఫున చురుగ్గా ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో మావటూరు వైసీపీ మద్దతు సర్పంచ్ నాగరాజు తమ్ముడు జీజే శేఖర్, నాయకులు మోహన్, చాకలి మారుతి, హరిజన సూర్యనారాయణ.. అతడిపై కక్ష పెంచుకున్నారు. దాడికి పథకం పన్నారు. అందులో భాగంగా సమీపంలోనే ఉన్న కర్ణాటకలోని దొమ్మితిమర్రి గ్రామంలో కాపుకాశారు. మద్యం షాపు వద్ద మద్యం తాగి వేచి ఉన్నారు. సంపత్‌కిష్టప్ప పని నిమిత్తం దొమ్మితిమర్రి గ్రామానికి వెళ్లగా.. మద్యం మత్తులో ఉన్న వైసీపీ వర్గీయులు కర్రలు, రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్ర గాయాలతో అతడు అక్కడే పడిపోయాడు. స్థానికుల సమాచారంతో కుటుంబీకులు అక్కడికి చేరుకుని సంపత్ కిష్టప్పను పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి పావగడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

ఈఏపీసెట్ ప్రారంభం


పరీక్షలు రాసివస్తున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, మే 16: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఈఏపీసెట్-2024) పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. 16, 17న అగ్రికల్చర్, ఫార్మసీ, 18 నుంచి 23 వరకు ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలు ఉంటాయి. అనంతపురంలో ఆరు, తాడిపత్రిలో రెండు, గుత్తి, పుట్టపర్తిలో ఒకటి చొప్పున మొత్తం పది కేంద్రాలను ఏర్పాటు చేశారు. రోజు రెండు సెషన్లలో పరీక్షలుంటాయని, ఒక్కో సెషన్‌కు 1600 నుంచి 1800 మంది విద్యార్థులు హాజరవుతారని అధికారులు తెలిపారు.

స్ట్రాంగ్‌రూములను పరిశీలించిన కలెక్టర్


స్ట్రాంగ్‌రూముల పరిశీలనకు వెళ్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, మే 16: జేఎన్‌టీయులోని అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూములను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ గురువారం పరిశీలించారు. భద్రతా చర్యలు, డ్యూటీలు గురించి ఆరా తీశారు. భద్రత విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయరాదని, సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ వరకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మద్యం మత్తులో పోలీసుల ఘర్షణ

కళ్యాణదుర్గం రూరల్, మే 16: మద్యం మత్తులో పోలీసులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన పట్టణ సమీపంలో చోటు చేసుకుంది. పట్టణ సమీపంలోని పంపుహౌస్ వద్ద పట్టణానికి చెందిన ఓ కానిస్టేబుల్ ఇద్దరు స్పెషల్ పార్టీ కానిస్టేబుళ్లు, ఓ జవాన్ నలుగురు మద్యం తాగి మాట మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకుని గాయపరచుకున్నట్లు తెలిసింది. ఈ గొడవను చుట్టుపక్కల వారు వీడియో తీయగా వారి వద్ద నుంచి ఫోటోలు వీడియోలు డిలీట్ చేయించినట్లు సమాచారం.

రాళ్ల దాడులపై కేసు నమోదు

పుట్లూరు, మే16: మండలంలోని ఓబులాపురం గ్రామంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ వర్గాలు రాళ్లదాడుల నేపథ్యంలో ఇరువురి వర్గాలపై కేసునమోదు చేసినట్లు గురువారం ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. మొత్తం 10మందిపై కేసు నమోదుచేశామన్నారు. టీడీపీ వర్గం నుంచి శ్రీనివాసులునాయుడుతోపాటు మరో ముగ్గురు, వైసీపీ నుంచి రమణతోపాటు మరో ఐదుమందిపై కేసు నమోదుచేశామని తెలిపారు.

అడిగేదెవరు?



ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం

● ఏడీసీసీ బ్యాంకులో ఇష్టారాజ్యం
● రుణాలకు లంచాల వసూలు
● ఏకపక్ష నిర్ణయాలతో అస్తవ్యస్తం
● అక్రమార్కులకు కొందరు ఉన్నతాధికారుల అండ



అనంతపురం క్లాక్‌టవర్, మే 16: జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో విచ్చలవిడిగా అవకతవకలు చోటుచేసుకుంటున్నా అడిగే నాథుడే లేడు. నిబంధనలకు విరుద్ధంగా లాకర్‌లు ఓపెన్ చేయడం, సొసైటీలు, బ్యాంకులలో రుణాలు పక్కదారి పట్టించడం, సొంతానికి ఉద్యోగులు వాడుకుంటుండటం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో పరిపాటిగా మారింది. గత నాలుగేళ్లుగా సొసైటీలకు ఎన్నికలు జరగకపోవడం, నామినేటెడ్ కమిటీల నియామకంతో పాలకవర్గం పలచపడిపోయింది. దీంతో ఏడీసీసీ బ్యాంకులో అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఇంత తతంగం జరుగుతున్నా సహకారశాఖ అధికారులు మాత్రం ఏడీసీసీ బ్యాంకువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

ప్రతి పనికీ ఓ రేటు..

ఏడీసీసీ బ్యాంకులో ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయిస్తున్నారు. ఏడాది పొడవున రైతులకు పంట రుణాలు ఇస్తామని అధికారులు ప్రకటించారు. ఇదే అదనుగా చేసుకున్న ఓ ఇద్దరు కీలక అధికారులు రుణం చెల్లించే ప్రతి ఫైల్‌కు ఓ రేటు ఫిక్స్ చేశారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు వేర్వేరుగా చెల్లిస్తారు. ఎకరాకు రూ.40వేలు నుంచి పంట ఆధారంగా రూ.80వేలు వరకు చెల్లిస్తున్నారు. ఎకరాకి 10శాతం చొప్పున ఆ ఇద్దరు అధికారులకు రైతులు ముడుపులు చెల్లిస్తేనే రుణాలు విడుదల చేస్తారు. లేదంటే కుంటి సాకులతో ఆ రైతులను రుణాల కోసం సొసైటీ, బ్యాంకులు, ప్రధాన కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారు. ఇటీవల కళ్యాణదుర్గం పరిధిలో ఓ రైతు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మూడు నెలల పాటు తిరిగిన బాధిత రైతు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉండిపోయారు. ఈ క్రమంలో ఆ ఇద్దరు కీలక అధికారులను నేరుగా సంప్రదించి ముడుపులు అందించి రుణం మంజూరు చేయించుకున్నారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే...ప్రతి నిత్యం ఏడీసీసీ బ్యాంకులో ఈ తంతు జరుగుతున్నా ఎవరూ నోరు మెదపకపోవడం ఆ ఇద్దరు అధికారులకు కలిసొస్తున్న అంశం.

లాకర్ తెరిచిన కేసు ఏమైనట్లు...?

ఏడీసీసీ బ్యాంకు మెయిన్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న మేనేజర్ సోమశేఖర్ నిబంధనలకు విరుద్ధంగా ఇటీవల లాకర్లు తెరిపించడంపై ఉత్తుత్తి విచారణ జరిపారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదిక అందజేసినా కీలక అధికారి సంబంధిత మేనేజర్ సోమశేఖర్‌పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినవస్తున్నాయి. వజ్రకరూరు సొసైటీలో రూ.20లక్షల వరకు అవినీతి జరిగినట్లు స్వయం అధికారులే తేల్చారు. రైతుల అప్పులకు జమచేయాల్సిన సొమ్మును సొసైటీ సీఈఓ తన సొంతానికి వాడుకున్నారు. ఆధారాలతో నిర్ధారించినా బాధ్యుడైన సీఈఓపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన శాఖలో పనిచేస్తున్న ఓ ఇద్దరు కీలక అధికారులు, వారి కనుసన్నల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కేసు బయటకు పొక్కకుండా కప్పిపెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడీసీసీ బ్యాంకు ఉన్నతాధికారులు కొందరు మామూళ్ల మత్తులో తూలుతూ ఇలాంటి అక్రమాలను వెనకేసుకొస్తున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి.

అక్రమార్కులకు అందలం

ఏడీసీసీ బ్యాంకులో అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న గోవిందరెడ్డిని గతేడాది ఉద్యోగం నుంచి తొలగించారు. ఒకే భూమికి సంబంధించి రెండు సొసైటీల్లో రుణం తీసుకున్నట్లు విచారణలో నిర్ధారించడంతో ఉద్యోగం నుంచి తీసివేశారు. అయితే ఆరు నెలలు గడవకనే బోర్డుకు అర్జీ పెట్టుకోవడంతో ఆయన్ను తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నారు. సాధారణంగా కోర్టు తీర్పునకు లోబడి ఉద్యోగం నుంచి తొలగించిన వ్యక్తిని తిరిగి తీసుకునే ప్రక్రియ జరుగుతుంది. అయితే గోవింద రెడ్డి విషయంలో ఏకపక్షంగా ఉద్యోగం నుంచి తొలగించడం...తిరిగి తీసుకోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటన్నది అంతుబట్టని విషయం. తొలగించిన చోటే హిందూపురం శాఖ సహాయ మేనేజర్‌గా గోవిందరెడ్డిని నియమించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదే శాఖలో పనిచేస్తున్న మేనేజర్ రాఘవేంద్రను అనంతపురంలోని ప్రధాన కార్యాలయానికి బదిలీ చేయడం...ఇన్‌చార్జి మేనేజర్‌గా గోవిందరెడ్డికి బాధ్యతలు అప్పగించడం పట్ల ముడుపుల బాగోతమే ననే చర్చ నడుస్తోంది.

కలిసికట్టుగా డెంగీని అరికడదాం

- వైద్యాధికారుల పిలుపు
- డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

ధర్మవరం, మే 16: డెంగీని అందరం కలిసికట్టుగా అరికడదామని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ సురేశ్‌నాయక్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జయరాం నాయక్ పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం వారు ఆస్పత్రి నుంచి వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలతో కలిసి ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురేశ్‌నాయక్, జయరాం నాయక్ మాట్లాడుతూ.. డెంగీ ఆర్బోవైరస్ వల్ల వస్తుందన్నారు. ఇది ఒకరి నుంచి మరొకరికి ఏడీఎస్ ఈజిప్టై దోమల ద్వారా సక్రమిస్తుందన్నారు. ఈ దోమలు పగటిపూట కుడతాయన్నారు. వీటి నివారణకు ప్రజలు ఇంటి పరిసరాలలో నీటిని నిల్వఉంచరాదన్నారు. రాత్రి సమయాల్లో ఇళ్ల ముంగిట వేపాకు పొగ వేసుకోవాలని , పడుకునేటప్పుడు దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు పుష్పలత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది , ఓడీసీలో..

ఓబుళదేవరచెరువు: డెంగీ నివారణపై మండలకేంద్రంలో గురువారం వైద్యాధికారి భానుప్రకాష్‌నాయక్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ డెంగీ నివారణకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. ప్రధానంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షపునీరు, ఇళ్లలోంచి వచ్చే నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. అలాగే టైర్లు, కొబ్బరి చిప్పలు, పాత డబ్బాలు, కుండలు తదితర వాటిలో కూడా నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వాటిల్లో నీరు ఉంటే దోమలు లార్వాలను వృద్ధి చేస్తాయన్నారు. తద్వారా డెంగీ వ్యాపిస్తుందన్నారు. కనుక శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి డెంగీ నివారణకు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు విజయకుమారి, మురళి, సిబ్బంది, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

దాబాలోకి దూసుకెళ్లిన బొలేరో

- తప్పిన ప్రమాదం


దాబాలోకి దూసుకెళ్లిన బొలేరో వాహనం

కొత్తచెరువు, మే 16: మండలకేంద్రంలోని ధర్మవరం రహదారి పక్కన ఉన్న ఓ దాబాలోకి బొలేరో వాహనం అతివేగంగా వచ్చి దూసుకెళ్లింది. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, డాబా సిబ్బంది తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం పట్టణానికి చెందిన బొలేరో వాహన డ్రైవర్ నీరుగంటి శంకర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తూ తూలడంతో ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి దాబాలోకి దూసుకొచ్చింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దాబాలో మాత్రం కొన్ని వస్తువులు డ్యామేజీ అయ్యాయి. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుందని వారు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అంధకారంలో జాతీయ రహదారి

- తనకల్లులోని రోడ్డులో వెలగని వీధిలైట్లు
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని పంచాయతీ అధికారులు


తనకల్లులో వెలగని వీధి లైట్లు

తనకల్లు, మే 16: మండలకేంద్రంలో జాతీయ రహదారికి ఏర్పాటు చేసిన వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో చీకటి పడతానే రోడ్డుతో పాటు సమీపంలోని వీధులన్నీ అంధకారంలో మగ్గుతున్నాయి. వీధి లైట్లు వెలుగుతున్నప్పుడు రహదారి కళకళలాడేది. అయితే ఆరు నెలల నుంచి అవి మరమ్మతుకు గురై వెలగడం లేదు. ఆ వీధి లైట్లను జాతీయ రహదారి అధికారులే నిర్వహించే వారు. అప్పట్లో బాగా వెలిగేవి. కాలపరిమితి పూర్తి కావడంతో ఆ అధికారులు తాము గ్రామ పంచాయతీకి ఆ బాధ్యత అప్పగించినట్లు చెబుతున్నారు. సచివాలయ అధికారులు మాత్రం ఇవేమి తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వెలుగులు లేక రోడ్డు, వీధులు అంధకారంలో ఉంటుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి లైట్లకోసం పలుమార్లు పంచాయతీ కార్యదర్శి, ఈఓఆర్డీలకు వినతిపత్రాలు ఇచ్చినా.. స్పందన కరువైంది. సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో రోడ్డులో బస్సు దిగి ఇళ్లకు వెళ్లాలంటే చీకటికి భయాందోళనకు గురవుతున్నామని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వీధి లైట్లువెలిగేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

గొడవలు పడితే కఠిన చర్యలు: ఎస్ఐ


వేల్పుమడుగులో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి, మే16: గ్రామాల్లో గొడవలు పడినా, సమస్యలు సృష్టించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని వేల్పుమడుగు గ్రామంలో గురువారం ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. ఇంకా ఓట్ల లెక్కింపు ఉందన్నారు. ప్రజలు ఎవరు గొడవలకు వెళ్లరాదన్నారు. ఎవరైనా గొడవలు చేసినా.. సృష్టించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్థులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో జీవించాలని తెలిపారు.

రైలు కిందపడి
గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

హిందూపురం, మే 16 : స్థానిక కొట్నూరు- నర్సాపురం మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని యువకుడు రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపారు. ఈ ఘటన గురు వారం మధ్యాహ్న సమయంలో జరిగిందని, యువకుడి శరీర భాగాలు ఛిద్రమయ్యాయన్నారు. విధుల్లో ఉన్న కీమ్యాన్ సమాచారం మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సుమారు 20ఏళ్ల పైబడి వయసున్న యువకుడు బూడిదరంగు నైట్ ప్యాంటు వేసుకున్నాడని, కుడిచేయికి కాషాయం తాడు కట్టుకున్నట్లు ఆనవాళ్లున్నాయన్నారు. ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వా లన్నారు. ఇదిలా ఉంటే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న యువకుడిది నర్సాపురమని ఇటీవల కొంత కాలంగా పూలకుంటలో నివాసమున్నట్లు సమాచారం. ఆ యువకుడు గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆ యువకుడే ఇలా చేసుకుని ఉంటాడని గ్రామస్థులు పోలీసులకు తెలిపారు. కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని గుర్తించాల్సి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం, మే 16: మండల పరిధిలోని కొ టిపి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. అయితే ఇది సాధారణ మరణమే అయిఉంటుందని అన్నారు. అతడు ఈ ప్రాంతానికి చెందినవాడుకాదని తెలిపారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

బీసీజీ ఇమ్యునైజేషన్ ప్రారంభం


ధర్మవరంలో టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

ధర్మవరం, మే 16: పట్టణంలోని అన్ని సచివాలయాల్లో గురువారం వయోజన బీసీజీ టీకాల కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎం హెచ్ఓ సెల్విసాల్మాన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం హెచ్ఓ మాట్లాడుతూ..... 60 ఏళ్లు దాటిన వారు , షుగర్ వ్యాధిగ్రసులు, పొగాకు తాగేవారు, బరువు తక్కువ ఉన్నవారు ఈ టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శ్వేత, సూపర్‌వైజర్ కిష్టప్ప, ఏఎన్ఎం అనిత, అర్బన్ సూపర్‌వైజర్ అన్నాలక్ష్మీనారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగేంద్రనాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తుల నోటితుంపర్ల నుంచి, గాలిద్వారా ఈవ్యాధి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. మూడురోజులు వరుసగా జ్వరం రావడం, దగ్గినప్పుడు రక్తంతో కూడిన గళ్ల పడడం, పక్కటెముకలు నొప్పి, ఆకలి లేకపోవడం, బరువుతగ్గడం ఈ వ్యాధి లక్షణాలన్నారు. నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రతి గురువారం నిర్వహించే నూతన వయోజన క్షయ టీకా కార్యక్రమాన్ని 60సంవత్సరాల వయసు దాటినవారు, షుగర్ వ్యాధిగ్రస్థులు, పొగతాగువారు, 18 ఏళ్ల లోపు వయసున్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపసమాచార అధికారి బాబాఫకృద్దీన్, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ భానుప్రకాష్‌నాయక్, కమల్ రోహిత్, ఆరోగ్య పర్యవేక్షకులు విజయకుమారి, మురళి, సిబ్బంది నాగేంద్ర, వరలక్ష్మీ, ఆరోగ్య కార్యకర్తలు నాగవేణి, బషీరా, రాధ, అంజలి తదితరులున్నారు.

మగ్గాల కాలనీలో నీటి సమస్య

- నాలుగేళ్ల క్రితం కాలిపోయిన మున్సిపల్ బోరు మోటారు
- ఇంతవరకు మరమ్మతుకు నోచుకోని వైనం
- ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు


తుప్పు పడుతున్న పైపులు

పుట్టపర్తి మే 16: జిల్లాకేంద్రంలోని ప్రధానరోడ్డులో అన్నాక్యాంటీన్ పక్కన నాలుగేళ్లుగా మున్సిపాలిటీ బోరుకు చెందిన మోటారు రిపేరుకు నోచుకోలేదు. నాలుగేళ్ల క్రితం ఆ మోటారు కాలిపోవడంతో దానిని బయటికి తీసి రిపేరుకు ఇచ్చి పైపులను పక్కన పడేశారు. అయితే ఇంతవరకు ఆ మోటారును తిరిగి బిగించలేదు. ఫలితంగా ఆ బోరు పరిధిలోని మగ్గాల కాలనీలో మున్సిపాలిటీ నీరు సరఫరా కావడం లేదు. ఈ కాలనీలో దాదాపు 50 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. వీరికి బోరు ద్వారా నీరు సరఫరా కావాల్సి ఉంది. అయితో మోటారు మరమ్మతుకు గురైనప్పటినుంచి నీరు రావడం లేదని, నాలుగేళ్లు గడిచినా మోటారును బిగించలేదని, ఇదేమని వాటర్‌మెన్‌ను అడిగితే అదిగో.. ఇదిగో అంటూ పొంతన లేని సమాధానం చెబుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. కాలిపోయిన మోటారు రిపేరుకు నోచునోకపోవడం వల్లనే బిగించలేదని తెలుస్తోంది. పక్కన పడేసిన పైపులు కూడా తుప్పు పడుతున్నాయని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి బోరు మోటార్‌కు మరమ్మతు చేయించి నీటి సమస్యను తీర్చాలని వారు కోరుతున్నారు.


నాలుగేళ్లుగా నిరపయోగంగా మున్సిపల్ బోరు

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

- ఒకప్పుడు ప్రయాణికుల రద్దీతో కళకళ
- ప్రస్తుతం వెలవెల
- ఉపయోగంలో లేక శిథిలావస్థకు


శిథిలావస్థకు చేరిన ఆర్టీసీ బస్టాండ్

నల్లమాడ, మే 16: మండలకంద్రంలో ఆర్టీసీ బస్టాండ్‌ను రూ.లక్షలు వెచ్చి నిర్మించారు. ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు ఉన్నప్పుడు క్రాంతి పథకం కిం ద నిర్మించారు. కొన్నేళ్లపాటు ఆ బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా ఉండేది. బస్సులు కూడా క్రమం తప్పకుం డా అక్కడికి వెళుతూ పోతూ ఉండేవి. అక్కడ క్యాంటీన్, కంట్రోలర్ గది కూడా ఉండేవి. ఆ బస్టాండ్ నిర్మాణానికి స్థానికుడు శివకేశవరెడ్డి ఎకరా స్థలాన్ని విరాళంగా ఇచ్చినట్లు ప్రజలంటున్నారు. అయితే ప్రస్తుతం ఆ బస్టాండ్ ఉపయోగంలో లేక శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఆ బస్టాండ్‌కు బస్సులు వెళ్లడం లేదు. పుట్టపర్తికి వెళ్లే ప్రధాన రహదారిలోని కూడలి వద్ద అవి నిలుస్తుండడంతో ప్రయాణికులు కూడా అక్కడే నిలబడి బస్సులు ఎక్కుతూ.. దిగుతున్నారు. కాగా ఆ ప్రాంతంలో ప్రయాణికుల వల్ల రద్దీ అధికమవుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రోడ్డుపై గంటల తరబడి నిలబడాలంటే ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లోకి బస్సులువచ్చి వెళ్లితే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి.

మొరాయిస్తున్న 108 వాహనాలు

- తరచూ మరమ్మతులకు గురవుతున్న వైనం
- బాధితులకు సమయానికి అందని సేవలు



ప్రభుత్వ ఆస్పత్రిలో 108వాహనం

కొత్తచెరువు, మే 16: అత్యాధునిక సౌకర్యాలతో 108 అంబులెన్స్‌ను అందుబాటులోకి తెచ్చామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. అయితే అవి మాత్రం తరచూ మరమ్మతులకు గురవుతూ ఎక్కడపడితే అక్కడ ఆగిపోతూ మొరాయిస్తున్నాయి. గతంలో 108కు ఫోన్‌చేస్తే 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలో వచ్చేది. ప్రస్తుతం అరగంటకు పైగా పడుతోందని పలువురు అంటున్నారు. ప్రతి మండలం, పట్టణంలో 108 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. అయితే ఏదేని ఆపద వచ్చినప్పుడు వాటికి ఫోన్ చేస్తే చాలా ఆలస్యంగా వస్తున్నాయి. బాధితులు చివరికి ప్రైవేటు వాహనాల్లో ఆస్పత్రులకు చేరుకుంటున్నారు. ఇటీవల కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల ప్రజలకు చాలామందికి ఇదే పరిస్థితి ఎదురైంది. సమయానికి 108 వాహనం రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని, అదేవిధంగా అంబులెన్స్‌లో సౌకర్యాలు అరకొరగా ఉన్నాయని పలువురు వాపోతున్నారు. సిబ్బంది కూడా జీతాలు పెంచకపోవడం, ఉన్నవారికి పనిభారం అధికం కావడంతో విధి నిర్వహణలో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి 108 వాహనాలకు మరమ్మతులు నిర్వహించి సమయానికి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హుండీ సొమ్ము లెక్కింపు

ఉరవకొండ, మే 16: మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి సమర్పించిన హుండీ సొమ్మును గురువారం లెక్కించారు. పర్యవేక్షణాధికారి రంగస్వామి నాయుడు, ఈవో విజయ్‌కుమార్ సమక్షంలో హుండీలను తెరచి లెక్కింపు నిర్వహించారు. 127రోజులకు గానూ రూ.22,84,123 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సభ్యులు

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

ధర్మవరం, మే 16: ఈ నెల 23వ తేదీ పౌర్ణమి సందర్భంగా ధర్మవరం ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసును నడపనున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. అరుణాచంలంలోని గిరిప్రదక్షిణతో పాటు కాణిపాకానికి బస్సు నడపనున్నామన్నారు. ఈనెల 22వ తేదీన ఉదయం 6గంటలకే బస్సు బయలుదేరుతుందన్నారు. రానుపోను చార్జీలు ఒక్కొక్కరికి రూ.1400 ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు బస్సు కౌంటర్‌లో కానీ , ఆన్‌లైన్‌లో కానీ సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7382860947, 6300220650 కు సంప్రదించాలని సూచించారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోండి


ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న ప్రగతిశీల విద్యార్థిసంఘం నాయకులు

ధర్మవరం రూరల్, మే16: పట్టణంలో ముందస్తుగా అక్రమ అడ్మిషన్లు చేస్తున్న పలు ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ప్రగతిశీల విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ గోపాల్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంజులనరేంద్ర మాట్లాడుతూ విద్యా నిబంధన జీవో నంబర్ 1ను పాటించకుండా పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా అడ్మిషన్లు చేస్తున్నాయన్నారు. అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాహక్కు చట్టం నిబంధనలను తుంగలో తొక్కుతున్న పాఠశాలలపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థిసంఘం నాయకులు నందకిషోర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎల్‌లో అనంత వరుస విజయాలు



ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి బహుమతి అందజేస్తున్న రంజీ మాజీ క్రీడాకారుడు సురేష్

అనంతపురం క్లాక్‌టవర్, మే 16: అనంతపురం ప్రీమియర్ క్రికెట్ లీగ్ (ఏపీఎల్) సీజన్-2 పోటీల్లో అనంత రైజింగ్ స్టార్ వరుసగా రెండో విజయం నమోదు చేసింది. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఏపీఎల్-2 క్రికెట్ పోటీలు మూడో రోజైన గురువారమూ కొనసాగాయి. అనంత రైజింగ్ స్టార్స్, ఫ్యామిలీ క్రికెట్ క్లబ్ జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన అనంత రైజింగ్ స్టార్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఫ్యామిలీ క్లబ్ 14.2 ఓవర్లలో 83 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంత రైజింగ్ స్టార్ బ్యాటర్ ప్రశాంత్ 57 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. దీంతో అనంత రైజింగ్ స్టార్ 71 పరుగుల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో దినేష్ గ్రానైట్స్ జట్టు, ఇండియన్ సిక్సర్స్ జట్లు మధ్య జరగగా... మొదట బ్యాటింగ్ చేసిన ఇండియన్ సిక్సర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లుకు 191 పరుగులు సాధించింది. ఇందులో ప్రవీణ్‌కుమార్ రెడ్డి 67 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. అనంతరం బరిలోకి దిగిన దినేష్ గ్రానైట్స్ 16.3ఓవర్లలో 114 పరుగులు మాత్రమే చేసి ఇండియన్ సిక్సర్స్ బౌలర్ల ధాటికి కుప్పకూలింది. ఈ కార్యక్రమంలో మాజీ రంజీ ప్లేయర్ సురేష్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, కోశాధికారి షబ్బీర్ అహ్మద్, సహాయ కార్యదర్శి భీమలింగారెడ్డి, సీనియర్ క్రీడాకారులు సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

సీనియర్ కళాకారుడు బండారు నగేష్ మృతి

నార్పల, మే 16: నార్పలకు చెందిన సీనియర్ కళాకారుడు బండారు నగేష్ (55) అనారోగ్యంతో బుధవారం రాత్రి మరణించారు. ఆయన 30 సంత్సరాలుగా రాష్ట్రంలో అనేక పౌరాణిక నాటకాలు వేసి మంచి గుర్తింపు పొందారు. పలు అవార్డులు కూడా దక్కాయి. ఆయనకు ఏడాదిగా ఆరోగ్యం బాగాలేదు. దీంతో ఆయన బుధవారం రాత్రి మరణించారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే సూరి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మీనుగా రామాంజనేయులు, మధ్యాహ్నం రాము, హరి, శివానంద, అమ్మలదీన్నే కుళ్లాయప్ప, రామకృష్ణ, పాల్గొన్నారు.

ఎలుగుబంటి హల్‌చల్


పొలాల్లో సంచరిస్తున్న ఎలుగుబంటి

కళ్యాణదుర్గంరూరల్, మే 16: శెట్టూరు మండలం కైరేవ గ్రామంలో ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. ఇద్దరు రైతులపై దాడి చేసినట్లు స్థానిక రైతులు తెలిపారు. పొలాల్లోకి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


సత్యనారాయణ పాడె మోస్తున్న ఐఎంఎం నాయకులు

అనంతపురం కల్చరల్, మే 16: ఓ అనాథ హిందూ వ్యక్తి కి ఇండియన్ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ (ఐఎంఎం) నాయకులు అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్కేయూ సమీపంలో నివాసముండే సత్యనారాయణ (56)కు రక్త సంబంధీకులెవరూ లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మరణిం చాడు. అంతిమ సంస్కారాలు నిర్వహించేవారెవరూ లేకపోవడంతో మాజీ కార్పొరేటర్ పావురాల చంద్రశేఖర్ ఐఎంఎం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మహబూబ్‌బాషాకు విషయం తెలిపారు. దీంతో ఆ నాయకులు సత్యనారాయణకు హిందూ సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, దాదు, బాషా, బషీర్, నూర్ పాల్గొన్నారు.

ఎస్కేయూ ఉద్యోగులకు అందని జీతం

అనంతపురం సెంట్రల్, మే 16: ఎస్కేయూలో సుమారు 800 మంది చిరుద్యోగులు గత నెల జీత అందక ఇబ్బందులు పడుతున్నారు. వర్సిటీ ఉద్యోగుల వేతనాలకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంలేదు. ఉన్నతాధికారులు రోజుల పాటు విజయవాడలో తిష్టవేసినా ఫలితం లేకుండా పోయింది. సెక్రెటరీ కార్యాల యంలో ఒక విభాగం నుంచి మరో విభాగానికి ఎస్కేయూ ఫైల్స్‌ను మూవ్ చేయించి వాటి ని అప్రూవల్ చేయించారు. అయినా నిధులు మాత్రం మంజూరు కాలేదని వర్సిటీ వర్గాలు వాపోతున్నాయి. జీతాల కోసం రిజిస్ట్రార్, ఫైనాన్స్ కార్యాలయం చుట్టూ తరుగుతున్నామని ఉద్యోగులు మండిపడుతున్నారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసినా జీతాలివ్వడంలేదని వాపోతున్నారు. నెలవారి వేతనాలపై ఆధారపడి జీవిస్తున్న తమ పరిస్థితి దయనీంగా మారిందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఫైనాన్స్ ఆఫీసర్ వెంకటరాముడిని దీనిపై వివరణ కోరాగా.. నిధులు జమ కాగానే జీతాలు పడిపోతాయని పేర్కొన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.36వేలు

అనంతపురం రూరల్, మే 16: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36,500, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.23 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 811 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

డీఎస్పీ చైతన్యను సస్పెండ్ చేయాలి

అనంతపురం క్లాక్‌టవర్, మే 16 : లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన స్థానంలో ఉంటూ... వైసీపీకి కొమ్ము కాస్తున్న డీఎస్పీ చైతన్యను వెంటనే సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసు నమోదు చేయాలని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, అనంతపురం క్లబ్ సభ్యుడు లక్ష్మన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తాడిపత్రిలో జరిగిన అల్లర్లలో ఏకపక్షంగా వ్యవహరిస్తూ, టీడీపీ నాయకులపై దాడులకు పాల్పడిన అతన్ని సస్పెండ్ చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో కంప్యూటర్ ఆపరేటర్, దివ్యాంగుడైన కిరణ్‌పై భౌతికదాడి చేసిన డీఎస్పీని విధుల నుంచి తొలగించి, కేసు నమోదు చేయాలన్నారు.

రేపు వాసవీ జయంతి

హిందూపురం అర్బన్, మే 16: ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ మాత జయంతి ఉత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు జేపీకే రాము, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి రవీంద్రుడు గురవారం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం9 గంటలకు పట్టణంలో బైక్‌ర్యాలీ, సాయంత్రం నగరోత్సవం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు తెలిపారు. ఆర్యవైశులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కులస్థులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి వాసవీఆలయంలో జరిగే కార్యక్రమాలకు హాజరు కావలెనని కోరారు.

ఉప్పర సగర విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

భగీరథ ఎడ్యుకేషనల్ సేవా ట్రస్ట్ ప్రకటన

హిందూపురం అర్బన్, మే 16: పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన ఉప్పర సగర కుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు భగీరథ ఎడ్యుకేషనల్ సేవా ట్రస్ట్ వారు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024వ సంవత్సరంలో పదోతరగతిలో 375 మార్కులు, ఇంటర్ పూర్తి చేసుకుని 600 మార్కులపైన వచ్చిన విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాక పురస్కరాలు ఉంటాయన్నారు. ప్రతిభా విద్యార్థులు ఈ నెల 25వ తేదీ లోగా పరిగిరోడ్డులోని మధుర మీనాక్షి కల్యాణమండపంలో తమ బయోడేటా, ఆధార్‌కార్డు, మార్కుల జాబితా జిరాక్స్‌ను అందించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 8008544627, 9912394649, 9963334111ను సంప్రదించాలన్నారు.

కబడ్డీ వేసవి శిక్షణ ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, మే 16: కబడ్డీ వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఉదయం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో ప్రారంభించారు. ఆ క్రీడాకారులకు ఎస్ఆర్ఎం బిల్డర్స్ సంస్థ అధినేత శివ రామాంజుల రెడ్డి, నవీన్‌రెడ్డి దుస్తులు, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. దాతలకు డీఎస్‌డీఓ షఫీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు అనీల్‌కుమార్, జెబీవుల్లా, క్రీడాకారులు పాల్గొన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.36వేలు

అనంతపురంరూరల్, మే 16: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36,500, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.23 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 811 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

హిందూపురం, మే 16: స్థానిక కొట్నూరు-నర్సాపురం మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని యువకుడు రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపారు. ఈ ఘటన గురువారం మధ్యాహ్న సమయంలో జరిగిందని, యువకుడి శరీర భాగాలు ఛిద్రమయ్యాయన్నారు. విధుల్లో ఉన్న కీమ్యాన్ సమాచారం మేరకు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సుమారు 20ఏళ్ల పైబడి వయసున్న యువకుడు బూడిదరంగు నైట్ ప్యాంటు వేసుకున్నాడని, కుడిచేయికి కాషాయం తాడు కట్టుకున్నట్టు ఆనవాళ్లున్నాయన్నారు. ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇదిలా ఉంటే రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న యువకుడిది నర్సాపురమని ఇటీవల కొంతకాలంగా పూలకుంటలో నివాసమున్నట్లు సమాచారం. ఆ యువకుడు గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆ యువకుడే ఇలా చేసుకుని ఉంటాడని గ్రామస్థులు పోలీసులకు తెలిపారు. కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని గుర్తించాల్సి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం, మే 16: మండల పరిధిలోని కొటిపి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. అయితే ఇది సాధారణ మరణమే అయిఉంటుందని అన్నారు. అతడు ఈ ప్రాంతానికి చెందినవాడుకాదని తెలిపారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రాజస్థాన్ వాసి మృతి



పార్సీలాల్ (ఫైల్)

పావగడ, మే 16: పట్టణంలోని వేణుగోపాల స్వామి వీధిలో స్వీట్ల వ్యాపారం నిర్వహిస్తున్న పార్సీలాల్ (45) అనేవ్యక్తి విద్యుదాఘాతంతో గురువారం ఉదయం మృతి చెందాడు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఆయన 13 సంవత్సరాలుగా పావగడ పట్టణంలో స్వీట్ల వ్యాపారం చేస్తూ కుటుంబ పోషణ సాగించేవాడని బంధువులు తెలిపారు. ఎప్పటిలాగే గురువారం తన తోపుడు బండిలోని బ్యాటరీకి చార్జింగ్ పెట్టడానికి వెళ్లాడు. అయితే ఆ సమయంలో ఉన్నట్టుండి విద్యుదాఘాతం జరగడంతో మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బంధువుల సమాచారం మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ సురేష్ తెలి పారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

విమర్శలు మానుకోండి: టీడీపీ

మడకశిరటౌన్, మే 16: కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీపై విమర్శలు మానుకోవాలని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు భక్తర్ అన్నారు. వారు గురువారం బాలాజీ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన రఘువీరారెడ్డి నియోజకవర్గానికి ఎందుకు వక్క మార్కెట్ తేలేకపోయారని, భూ హక్కు చట్టంకింద ఎస్సీ ఎస్టీలకు భూములను ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. మడకశిర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే స్థానంలో ఉన్నా ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, క్లస్టర్‌ఇన్‌చార్జ్ కన్నా, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు భీమన్న, కరియన్న పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా నిలిచిన సచివాలయ నిర్మాణం

- ఆర్భీకే నిర్మాణం కూడా..
- ప్రారంభంకాని విలేజ్ క్లినిక్ పనులు
- కంబాలపల్లిలో ఇదీ పరిస్థితి





అర్ధంతరంగా నిలిచిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణం

రొద్దం, మే 16 : మండలపరిధిలోని కంబాలపల్లిలో గ్రామ సచివాలయ ని ర్మా ణ పనులు నాలుగేళ్లుగా నిలిచిపోయాయి. దీనిపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఐదేళ్ల క్రితం వైసీపీ అధికారంలోకి రాగానే... రాష్ట్రంలో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపించడానికి కృషిచేస్తున్నామంటూ ప్రతి పంచాయతీకి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్‌క్లినిక్‌లను మంజూరు చేసింది. మండలపరిధిలో 15గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసింది. పక్కా భవనాలను మంజూరు చేసి నిర్మించింది. వాటిలో మిగిలిన వన్నీ పూర్తయినా కంబాలపలి లో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాల నిర్మాణ పనులు అర్ధం తరంగా ఆగిపోయాయి. కంబాలపల్లి గ్రామ సచివాలయ నిర్మాణ పనులు జరుగుతుండగా అక్కడ పనిచేసే కూలీకి ప్రమాదవశాత్తు పై నుంచి కిందపడి ఆసుపత్రి పాలయ్యాడు. దీంతో కాంట్రాక్టర్ పనులు ఆపేయడంతో సచివాలయ నిర్మాణం పనులు ముందుకు సాగలేదు. రైతు భరోసా కేంద్రం నిర్మాణం సైతం అర్ధంతరంగా ఆగిపోయింది. విలేజ్ క్లినిక్ నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అలాగే దొడగట్ట గ్రామంలో విలేజ్ క్లినిక్ భవన నిర్మాణం మొండి గోడలకే పరిమితమైంది. అయితే వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సకాలంలోబిల్లులు చెల్లించకపోవడంతో అనేక చోట్ల భవన నిర్మాణ పనులు పూర్తికాలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

తగ్గిన పోలింగ్ శాతం

మడకశిరలో మహిళల కన్నా అధికంగా పురుషుల ఓటింగ్

మడకశిర, మే16: నియోజకవర్గంలో ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 87.45శాతం పోలింగ్ నమోదైంది. ఇది గత ఎన్నికల కంటే తక్కువ. నియోజకవర్గం వ్యాప్తంగా 2019లో జరిగిన ఎన్నికల్లో 88.37 శాతం పోలింగ నమోదు కాగా ఈ ఎన్నికల్లో 0.92 శాతం తక్కువగా పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 2,10,804 మంది ఓటర్లు ఉన్నారు ఇందులో 1,84,524 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురషులు 1,05,760 మంది కి గాను 93,487 మంది, మహిళలు 1,05,043 మందికిగాను 91,037 మంది ఓటు వేశారు. నియోజకవర్గ పరిధిలో 93,487 మంది పురుషులు, 91,037 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళల కంటే పురుషులే అధికంగా ఓటు వేశారు. మండలాల వారీగా ఓటు వేసిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	మహిళలు	పురుషులు	మొత్తం
అమరాపురం	20345	19856	40201
అగలి	12131	11858	23989
మడకశిర	21088	20752	41840
మడకశిర అర్బన్	6831	7034	13865
రొళ్ళ	14135	13168	27303
గుడిబండ	18957	18369	37326
మొత్తం	93487	91037	184524

మడకశిరకు చేరిన విత్తన వేరుశనగ



విత్తన నాణ్యతను పరిశీలిస్తున్న ఏఓ తిమ్మప్ప

మడకశిర టౌన్, మే 16: మడకశిర నియోజకవర్గంలో వర్షాధారం కింద అత్యధికంగా వేరుశనగ పంటను సాగు చేస్తా రు. ఇది దృష్టిలో ఉంచుకొన్న అధికారులు ఈ సంవత్సరం ఖరీఫ్ లో వేరుశనగ పంట సాగు చేసేందుకు విత్త న కాయల ను సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు పంపిణీ చేసేందుకు గురువారం వేరుశనగ విత్తన కాయలు మడకశిరకు చేరినట్లు ఏఓ తిమ్మప్ప తెలిపారు. ఏజెన్సీలు సరఫరా చేసే విత్తన కాయలు నాణ్యమైనవిగా ఉండాలని, లేని పక్షంలో తిప్పి పంపుతామని ఏఓ న్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సకాలంలో విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా వేరుశనగ విత్తన కాయల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మడకశిర మండలంలో 20 రైతు భరోసా కేంద్రాలు, రొళ్లలో 10, గుడిబండలో 15, అమరాపురంలో 15, అగళి మండలంలో 11 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్‌లో సాగుచేసే రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

అనంతపురం కల్చరల్, మే 16: ఓ అనాథ హిందూ వ్యక్తి కి ఇండియన్ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ (ఐఎంఎం) నాయకులు అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్కేయూ సమీపంలో నివాసముండే సత్యనారాయణ (56)కు రక్త సంబంధీకులు లెవరూ లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మరణిం చాడు. అంతిమ సంస్కారాలు నిర్వహించేవారెవరూ లేకపోవడంతో మాజీ కార్పొరేటర్ పావురాల చంద్రశేఖర్ ఐఎంఎం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మహబూబ్‌బాషాకు విషయం తెలిపారు. దీంతో ఆ నాయకులు సత్యనారాయణకు హిందూ సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, దాదు, బాషా, బషీర్, నూర్ పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే కీలకం: సవిత



నాయకులతో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

పెనుకొండ టౌన్, మే 16 : సార్వత్రిక ఎన్నికల్లో గెలుపోటములు నిర్ణయించేది మహిళా ఓటర్లేనని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత స్థానిక నాయకులతో పేర్కొన్నారు. ఆమె గురువారం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి ఆయా మండలాల్లో జరిగిన ఓటింగ్ సరళిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్‌లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని బారులు తీరారన్నారు. టీడీపీ మేనిఫెస్టో ఉపయోగకరంగా ఉండటంతో మహిళలు అధిక శాతం ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపారన్నారు. ఏది ఏమైనా రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని, అలాగే పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీకి అఖండమెజార్టీతో ఓటరు తీర్పు ఇవ్వనున్నట్లు తెలిపారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



డెంగీపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గోరంట్ల, మే 16: మండలకేంద్రమైన ప్రాథమిక వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం మండలకేంద్రంలో జాతీయ డెంగీ నివారణ దినాన్ని నిర్వహించారు. వైద్యాధికారి శ్రుతి ఆధ్వర్యంలో ఆసుపత్రి వద్దనుంచి ప్రధాన రహదారిపై ర్యాలీ సాగింది. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టైగర్ దోమవలన డెంగీ వ్యాధి వస్తుందని, ఇంట్లోని మంచినీటి తొట్టెలను శుభ్రం చేస్తుండాలన్నారు. టైర్లు, టెంకాయ చిప్పలు, రోళ్లలోని మంచినీటిని తొలగించి, దోమ లార్వాలను నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రమణ, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు సువర్ణాదేవి, రసూల్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దాబాలోకి దూసుకెళ్లిన వాహనం



దాబాలోకి దూసుకెళ్లిన బొలేరో వాహనం

కొత్తచెరువు, మే 16: మండలకేంద్రంలోని ధర్మవరం రహదారి పక్కన ఉన్న ఓ దాబాలోకి బొలేరో వాహనం అతివేగంగా వచ్చి దూసుకెళ్లింది. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, డాబా సిబ్బంది తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం పట్టణానికి చెందిన బొలేరో వాహన డ్రైవర్ నీరుగంటి శంకర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తూ తూలడంతో ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి దాబాలోకి దూసుకొచ్చింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దాబాలో మాత్రం కొన్ని వస్తువులు డ్యామేజీ అయ్యాయి. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుందని వారు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చినుకు పడితే బురదమయం

ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు



బురదమయమైన రామాయన హట్టి గ్రామానికి వెళ్లే రహదారి



కొంకల్లు వెళ్లే రహదారిలో నిలిచిన బురదనీరు

గుడిబండ, మే 16 : వర్షం కురిస్తే చాలు మండలంలోని మట్టి రోడ్లు బురదమయం అవుతున్నాయి. మండలంలోని జమ్ములబండ నుంచి రామాయనహట్టి మీదుగా మేకులగడ్డ వరకు సుమారు 10కి.మీ. మట్టి రోడ్డు ఉంది. అలాగే కొంక ల్లు గేటు నుంచి కొంకల్లు గ్రామానికి సుమారు కిలో మీటరు, ఆదిబైరేశ్వరస్వామి దేవాలయం నుంచి సీసీగిరి గ్రామానికి వెళ్లే కిలోమీటరు మట్టి రోడ్డు ఉన్నాయి. ఈ రోడ్లలో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు, వాహన దారులు వాపోతున్నారు. మండలంలో ఆది, సోమవారాల్లో కురిసిన వర్షాలకు ఈ రోడ్లన్నీ బురదమయమయ్యాయి. ఆ రోడ్లలో ప్రయాణించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో కురిసిన వర్షానికి మట్టి రోడ్లు కోతకు గురై గుంతలు ఏర్పడుతాయి. గుంతల్లో వర్షం నీరు నిలవడం, రోడ్డంతా బురదమయం అవుతోందని అంటున్నారు. ఆ సమయంలో ప్రయాణం నరకప్రాయంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ రోడ్లు బాగు పడడం లేదన అంటున్నారు. ఈ రోడ్లపై తమ గ్రామాల వాసులకు తిప్పలు తప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హేమావతి గ్రామంలో...

మడకశిర టౌన్: అమరాపురం మండల పరిధిలోని హేమావతి గ్రామంలోని ఎస్సీ కాలనీలో వర్షం వ స్తే ప్రజలు నడిచి వెళ్లేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. గ్రామంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిల్వ ఉండి, రోడ్డంతా బురదమ యంగా మారింది. గ్రామానికి చెందిన న్యాయవాది కృష్ణమూర్తి మాట్లాడుతూ సమస్య పరిష్కరించాలని ఈ ఏడాది జనవరి 8న మండలకేంద్రంలో స్పందన కార్యక్రమంలో అర్జీ అందించామని తెలిపారు. అలాగే జనవరి 22న పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో అర్జీ అందించామని, సీసీ రోడ్డును ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.



వర్షం రాకతో ఎస్సీ కాలనీలో బురదమయంగా మారిన రోడ్డు

టీకా తప్పనిసరిగా వేయించుకోవాలి

టీబీ రోగులకు డీఎంహెచ్ఓ సూచన



బీసీజీ టీకాపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ మంజువాణి

రొద్దం, మే 16 : అరవైఏళ్ల పైబడిన టీబీ వ్యాధిగ్రస్థులు తప్పనిసరిగా బీసీజీ టీకాను తప్పనిసరిగా వేయించుకోవాలని డీఎంహెచ్ఓ మంజువాణి సూచించారు. ఆమె గురువారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీచేసి బీజీజీ టీకాపై అధికారులకు అవగాహన కల్పించారు. ఇదివర కే టీబీ సోకిన చక్కెర వ్యాధి గ్రస్థులు, ధూమపానం చేయువారు, బాడి మాస్ ఇండెక్స్ 18కన్నా తక్కువ ఉన్నవారు టీకా తీసుకోవచ్చన్నారు. ఈ వ్యాధిగ్రస్థులను గ్రామీన ప్రాంతాల్లో గుర్తించి తప్పనిసరిగా టీకా తీసుకోవాలని అధికారులను సూచించారు. వైద్యాధికారి రమ్య, ప్రవీణ్‌కుమార్, ఎంపీహెచ్ఈఓ సుదర్శన్‌బాబు, ఎంఎల్‌హెచ్‌పీ ప్రమీళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అగళి: మండలంలోని అన్ని గ్రామాల్లో టీబీ వ్యాధిగ్రస్థులను గుర్తించి వారికి బీసీజీ టీకా వేయనున్నట్లు డాక్టర్ శివానంద గాయత్రి తెలిపారు. మండలంలోని ఆలూడి గ్రామ సచివాలయంలో గురువారం 41మందికి బీసీజీ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో టీబీ వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు వైద్య పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. వారం దరికీ ఈ టీకా వేస్తామని తెలిపారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. టీబీతో పాటు షుగర్ తదితర వ్యాధులు ఉన్నవారిని గుర్తించి టీకా వేసేందుకు వైద్య పరీక్షలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సూపర్ వైజర్ నర్సారెడ్డి, హెల్త్ అసిస్టెంట్‌లు సుందరయ్య, భిక్షపతి, నవీన్, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

టీడీపీ జెండా ఎగరడం ఖాయం: నాయకులు

రొళ్ల, మే 16: నియోజకవర్గంలో టీడీపీ విజయం తథ్యమని, మడకశిర కోటపై టీడీపీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, టీఎన్‌టీయుసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, ఎస్సీ సెల్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, ఎస్సీసెల్ నాయకులు మూర్తి, బాలకృష్ణ తదితరులు ధీమా వ్యక్తం చేశారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ... ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు అత్యధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారన్నారు. ఈనేపథ్యంలో అధిక శాతం ఓటర్లు టీడీపీ వైపే మొగ్గు చూపారని, ఎన్నడూ లేని విధంగా మెజార్టీ వస్తుందన్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపులో రాష్ట్రంలో టీడీపీ అత్యధిక స్థానాలను గెలుచుకొని నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడం ఖాయమన్నారు. ఆయన రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథంలో తీసుకెళతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఉపాధి పనులకు రండి: ఏపీఓ



ఆమిదాలగొంది వద్ద పనులను పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్

మడకశిర రూరల్, మే 16 : ఉపాధి హామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. మండల వ్యాప్తంగా 3200 మంది కూలీలు పనులు చేస్తున్నట్లు తెలిపారు ఎండలు ఎక్కువగా ఉండడంతో కూలీలు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరుకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన గురువారం మడకశిర మండలంలోని ఆమిదాలగొంది పంచాయతీ కేంద్రం సమీపంలో జరుగుతున్న పనులను తనిఖీచేశారు. రోజురోజుకు కూలీల సంఖ్య బాగా పెరుగుతున్నట్లు తెలిపారు. చేసిన పనులకు కూలీలకు సకాంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. జాబ్ కార్డు ఉన్న కూలీలు అందరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎస్కేయూ ఉద్యోగులకు అందని వేతనాలు

అనంతపురం సెంట్రల్, మే 16: ఎస్కేయూలో సుమారు 800 మంది చిరుద్యోగులు గత నెల జీత అందక ఇబ్బందులు పడుతున్నారు. వర్సిటీ ఉద్యోగుల వేతనాలకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంలేదు. ఉన్నతాధికారులు రోజుల పాటు విజయవాడలో తిష్టవేసినా ఫలితం లేకుండా పోయింది. సెక్రెటరీ కార్యాల యంలో ఒక విభాగం నుంచి మరో విభాగానికి ఎస్కేయూ ఫైల్స్‌ను మూవ్ చేయించి వాటిని అప్రూవల్ చేయించారు. అయినా నిధులు మాత్రం మంజూరు కాలేదని వర్సిటీ వర్గాలు వాపోతున్నాయి. జీతాల కోసం రిజిస్ట్రార్, ఫైనాన్స్ కార్యాలయం చుట్టూ తరుగుతున్నామని ఉద్యోగులు మండిపడుతున్నారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసినా జీతాలివ్వడంలేదని వాపోతున్నారు. నెలవారి వేతనాలపై ఆధారపడి జీవిస్తున్న తమ పరిస్థితి దయనీంగా మారిందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఫైనాన్స్ ఆఫీసర్ వెంకటరాముడిని దీనిపై వివరణ కోరగా.. నిధులు జమ కాగానే జీతాలు పడిపోతాయని పేర్కొన్నారు.



మణూరు-కల్లుమర్రి ప్రధాన రహదారిలో కూలిన కల్వర్టు

మరమ్మతులకు నోచుకోని కల్వర్టు

రెండేళ్లుగా రాకపోకలకు ఇబ్బందులు

మడకశిర రూరల్, మే 16 : రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు కల్వర్ట తెగిపోవడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామీణ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మణూరు- కల్లుమర్రి, సీ కోడిగేపల్లికి వేళ్లే ప్రధాన రహదారిలోని కల్వర్టు రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు కుప్ప కూలి పోయింది. అప్పటి నుంచి దాని మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ప్రజలు వ్యవ సాయ పొలాల గుండా రాకపోకలు సాగిస్తున్నారు. త్వరలో వర్షాకాలం ప్రారం భంకానుంది. రైతులు పొలాలను దుక్కులు చేసే సమయం ఇది. దీంతో రైతు లు తమ పొలాల గుండా వాహనాలు వెళ్లకుండా అడ్డుకుంటే.... మణూరు, కల్లుమర్రి, సీ కోడిగేపల్లి మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. వారికి మరో మార్గం లేదు. తెగిన కల్వర్టుకు మరమ్మతులు చేయాలని అనేకసార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించలేదని ఆయా గ్రామస్థులు వా పోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తెగిన కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.



రైతు పొలం గుండా వెళ్తున్న వాహనదారు